ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7, కనిష్ఠం 25.3

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 5 ఆగస్టు 2025

నేడు మందకృష్ణ రాక



ఆర్మూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ మంగళవారం ఆర్మూర్‌కు రానున్నారు. పట్టణంలో నిర్వహించనున్న వికలాంగులకు పెన్షన్ పెంపుపై సన్నాహక సదస్సులో ఆయన పాల్గొంటారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి తెలిపారు. బహుజనులు, వికలాంగులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

సమయపాలన పాటించకుంటే వేటు తప్పదు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- అభివృద్ధి పనులు, భూభారతిపై అధికారులతో సమీక్ష
- ఆరోగ్య కేంద్రం, పాఠశాలలు, అంగన్‌వాడీ తనిఖీ

రెంజల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే వేటు తప్పదని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతో పాటు అంగన్‌వాడీ సెంటర్, వీరన్నగుట్ట పాఠశాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా నిర్వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటెండెన్స్ రిజిష్టర్‌లో స్వయంగా కలెక్టర్ అప్‌సెంట్ వేసి డీఎంహెచ్‌వోకు గైర్హాజర్లు అయిన సిబ్బంది వివరాలను పంపించారు. రెంజల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు లేకపోవడంతో తగు చర్యలు తీసుకోవాలని సీడీపీవోకు ఫోన్‌లో ఆదేశించారు. వీరన్నగుట్టలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఫేస్ రికగ్నైషన్ విధానం చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని హెచ్ఎంను ఆదేశించారు. సహకార సంఘం ఎరువుల గోదాంను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ రాజ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమీక్ష జరపాలని, వచ్చిన దరఖాస్తులలో పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆసియా ఫాతిమా, ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో ఆంజనేయులు, ఎంపీవో రఫీ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మాత్రలను అందించాలి

- అల్బెండజోల్ మాత్రతో ఆరోగ్య సమస్యలు దూరం
- కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి

8

గడువు లోపు గగనమే!



- నత్తనడకన భూ భారతి దరఖాస్తుల పరిశీలన
- ఈ నెల 15 వరకు పరిశీలనకు ప్రభుత్వం గడువు
- క్షేత్రస్థాయిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లాలో 40,488 దరఖాస్తులు
- పరిష్కరించదగిన దరఖాస్తులు 22,607
- సాదాబైనామాల పరిష్కారంపై స్పష్టత కరువు

జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిశీలన గడువులోగా పూర్తికావడం గగనంగానే కనిపిస్తోంది. ఈ నెల 15లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు విధించినా క్షేత్రస్థాయిలో సరిపడా సిబ్బంది లేక నత్తనడకన సాగుతోంది. దీంతో భూభారతి ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు.

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల భూసమస్యలు పరిష్కారం కాకపోగా పట్టాదారులకు అనేక సమస్యలను తెచ్చి పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభు త్వం నిర్ణయించిన ఆగస్టు 15 గడువులోగా భూభారతి దరఖాస్తుల పరిష్కా రం అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. భూభారతి ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జిల్లాలోని 33 మండలాల్లో జూన్ 3వ తేదీ నుంచి 20 వరకు 570 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 40,468 దరఖాస్తులు రాగా ప్రస్తుతం పరిష్కారం చేయతగిన దరఖాస్తులు 22,607గా అధికారులు గుర్తించారు. ఇందులో పీవోటీ దరఖాస్తులు 9233 కాగా, సాదాబైనామా దరఖాస్తులు 9185, ఇతర సర్వే సంబంధించిన దరఖాస్తులు 4189 వచ్చాయి. దరఖాస్తులలో ఆయా సమస్యలకు సంబంధించి తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌ల ద్వారా నోటీసులు ఇస్తున్నారు. ఇప్పటి వరకు 37వేల 554 దరఖాస్తులకు అధికారులు నోటీసులు ఇవ్వగా 2062 దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో దరఖాస్తు కోసం సిద్ధం చేశారు. ఆన్‌లైన్‌లో 791 దరఖాస్తులు అధికారులు అప్‌డేట్ చేశారు. జిల్లాలో అత్యధికంగా సాదాబైనామాలకు దరఖాస్తులు రాగా గత పదేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాలేదు. గతంలో 2016లో జీవో నంబర్ 153 ద్వారా జూన్ 2, 2014 ముందు సాదాబైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసిన సాదాబైనామాలకు సంబంధించిన సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడు మళ్లీ రైతులు సాదాబైనామాల కోసం దరఖాస్తులు చేయగా వాటి పరిష్కారం కోసం అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో మళ్లీ సాదాబైనామాల పరిస్థితి మొదటికి వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సిబ్బంది కొరత..

భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. రెవెన్యూ సిబ్బంది మండలాలలో తక్కువగా ఉండడం, మండలానికి ఇద్దరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, ఒక సర్వేయర్ మాత్రమే ఉండటం దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. ప్రతీరోజు నాలుగు నుంచి ఐదు దరఖాస్తులు మాత్రమే పరిష్కరిస్తుండటం, రికార్డుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో ఎక్కువ సమయం తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చిన్న మండలం మెండోరా ఎంపిక చేయగా ఐదు నుంచి ఆరుగురు తహసీల్దార్లు, సిబ్బంది ఆ మండలంలో పనిచేసిన ఇంకా పూర్తిస్థాయిలో దరఖాస్తులు పరిష్కారం కాలేదంటే క్షేత్రస్థాయిలో ఏ స్థాయిలో ఇబ్బందులు ఏ విధంగా ఉన్నాయో తెలియజేస్తుంది.

సాదాబైనామాలపై లేని స్పష్టత..

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

మండలాల వారీగా దరఖాస్తులు..

జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారులు ఆర్‌వోఆర్ 2020-25 భూభారతి చట్టం ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో అత్యధికంగా సిరికొండ మండలంలో 4084 దరఖాస్తులు రాగా అత్యల్పంగా నిజామాబాద్ నార్త్‌లో 15 దరఖాస్తులు వచ్చాయి. ఆలూర్‌లో 335, ఆర్మూర్‌లో 1544, బాల్కొండలో 784, భీంగల్‌లో 2306, బోధన్‌లో 1081, చందూర్‌లో 76, ధర్పల్లిలో 2551, డిచ్‌పల్లిలో 3064, డొంకేశ్వర్‌లో 422, ఇందల్వాయిలో 3578, జక్రాన్‌పల్లిలో 2478, కమ్మర్‌పల్లిలో 2339, కోటగిరిలో 305, మాక్లూర్‌లో 1674, మెండోరాలో 732, మోర్తాడ్‌లో 1438, మోస్రాలో 65, మోపాల్‌లో 2256, ముప్కాల్‌లో 647, నందిపేటలో 1182, నవీపేటలో 2320, నిజామాబాద్ రూరల్‌లో 1409, నిజామాబాద్ సౌత్‌లో 41, పోతంగల్ 480, రేంజల్ 308, రుద్రూర్ 312, సాలూరా 222, వేల్పూర్ 727, వర్ని 291, ఎడపల్లి 836, ఏర్గట్ల 1496 దరఖాస్తులు వచ్చాయి.



బ్యాలెట్ బాక్సులను దింపుతున్న సిబ్బంది

జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

- స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారుల సమాయత్తం
- ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్న వేళ జిల్లా యంత్రాంగం సైతం ఎన్నికల నిర్వాహణకు ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు ఎన్నికల సామగ్రి క్రమ క్రమంగా చేరుకుంటుంది. సోమవారం జిల్లాకు బ్యాలెట్ బాక్సులను మూడు లారీలలో తీసుకువచ్చారు. అహ్మదాబాద్ నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చిన నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులను అధికారులు ఆయా మండలాలకు తరలిస్తున్నారు. సోమవారం 3440 బ్యాలెట్ బాక్సులు జిల్లాకు చేరగా ఇప్పటికే 3840 బ్యాలెట్ బాక్సులు జిల్లాకు చేరుకున్నాయి. ఈ బ్యాలెట్ బాక్సుల ద్వారా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు సరిపోతాయని జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారి అన్నారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని, వైద్య కళాశాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ హెల్త్ పాలసీకి అనుగుణంగా ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. అనంతరం మెడికల్ కాలేజీ పనితీరుపై ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్‌తో కలిసి సమీక్షించారు. వైద్య విద్యార్థులు పూర్తిస్థాయిలో ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. నిర్వహణకు సంబంధించి సమగ్ర అంశాలను పొందుపరుస్తూ కమిషన్ కార్యాలయానికి నివేదికలు పంపాలని సూచించారు. చైర్మన్ వెంట సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, వైద్యులు ఉన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న చైర్మన్

నేడు హైదరాబాద్‌లో పారా అథ్లెటిక్ పోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారుల కోసం హైదరాబాద్‌లో పారా అథ్లెటిక్ పోటీలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ అధికారి రసూల్‌బీ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, అసోసియేషన్‌లు, దివ్యాంగ క్రీడాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ పోటీలో పాల్గొనాలని కోరారు. వివరాల కోసం దివ్యాంగుల కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

నేడు రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ సదస్సు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన జేఏసీ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ జేఏసీ నాయకులు ప్రేమ్‌కుమార్, మహిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని లహరి హోటల్‌లో మంగళవారం ఈ కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, ముఖ్యవక్తగా డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరవు తు న్నట్లు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీ సాయి చైతన్య

క్రీడలతో ఉద్యోగుల్లో స్నేహభావం పెరుగుతుంది

- ప్రకృతి వైపరిత్యాల సమయంలో విద్యుత్ పునరుద్ధరణ ఉద్యోగులకు కత్తిమీద సాము లాంటిది
- ట్రాన్స్‌కో డిస్కం హాకీ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పోలీసు కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉద్యోగుల మధ్య స్నేహభావం పెరుగుతుందని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం తెలంగాణ ట్రాన్స్‌కో డిస్కం ఇంటర్ సర్కిల్ హాకీ టోర్నమెంట్, బ్రిడ్జి చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉద్యోగులు పని ఒత్తిడికి లోనై ఇబ్బందులు పడుతుంటారని, క్రీడల వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు విద్యుత్ పునరుద్ధరించడం ఉద్యోగులకు కత్తిమీద సాములాంటిదని అన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ విద్యుత్ ఉద్యోగులు ఐకమత్యాన్ని చాటాలని కోరారు. ఈ క్రీడలు రెండు రోజులపాటు జరగనున్నాయని తెలిపారు.

మిగతా 8వ పేజీలో...

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్



- జిల్లా కాంగ్రెస్‌లో జోష్ నింపిన జనహిత పాదయాత్ర
- పీసీసీ అధ్యక్షుడు సొంత జిల్లా కావడంతో ఐక్యంగా కదిలిన జిల్లా నాయకులు
- అలసత్వాన్ని ఉపేక్షించమని సంకేతం ఇచ్చిన పీసీసీ చీఫ్
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న క్యాడర్

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జనహిత పాదయాత్ర జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్‌ను నింపింది. క్యాడర్‌తో పాటు నాయకులు ఏకతాటిపైకి వచ్చి జిల్లాలో రెండు రోజుల జనహిత పాదయాత్రను విజయవంతం చేయడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు నిర్వహించిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో జనహిత పాదయాత్ర జోష్ నింపింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొనడంతో పాటు ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో క్షేత్రస్థాయిలో నాయకుల సమస్యలు, పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ అగ్రనాయకత్వం సైతం పార్టీలో గత పదేళ్లలో కష్టపడిన వారికే పదవులు ఉంటాయని స్పష్టం చేయడంతో పార్టీ క్యాడర్ సైతం తమకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందనే నమ్మకాన్ని నాయకులు కలిగించారు. పీసీసీ అధ్యక్షుడు సొంత జిల్లా కావడంతో జిల్లా ముఖ్య నేతలంతా పాదయాత్రలో పాల్గొని తమ ఐక్యతను చాటారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో రెండు నియోజకవర్గాల్లో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ జనహిత పాదయాత్రలో మాత్రం ఎలాంటి విభేదాలు లేకుండా నేతలంతా పాల్గొన్నారు. జిల్లా నాయకత్వం సైతం అందరి నాయకులను కలుపుకొని వెళ్లి పాదయాత్రను విజయవంతం చేయడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇంకా గ్రామస్థాయిలో, మండల స్థాయిలో నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి పదవులు లేకపోవడంతో ఒకింత అసంతృప్తిగా ఉన్న క్యాడర్‌ను ఈ పాదయాత్ర ఉత్సాహాన్ని నింపింది. పీసీసీ అధ్యక్షుడు సైతం జిల్లా నాయకత్వానికి సుతిమెత్తగా హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. అందరూ ఏకతాటిపైకి వచ్చి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు పనిచేయాలని అలసత్వాన్ని ఉపేక్షించబోమని చెప్పినట్లు సమాచారం.

స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీలో ఉత్సాహం..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుపొందడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలను గెలుచుకుంటామని స్వయంగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. పీసీసీ చీఫ్ సొంత జిల్లా కావడంతో జనహిత పాదయాత్రలో జిల్లా నాయకులంతా పాల్గొన్నారు. కొద్దికాలంగా పదవులు లేక అసంతృప్తితో ఉన్న నాయకులు సైతం పీసీసీ చీఫ్ దృష్టిలో పడేందుకు పోటా పోటీగా జనసమీకరణ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో రెండు మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో సైతం జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు రాబోయే రోజుల్లో వ్యవసాయ కళాశాల, జక్రాన్‌పల్లికి ఎయిర్‌పోర్టు, జిల్లాను కలుపుతు టెంపుల్ కారిడార్‌ను తీసుకొస్తామని పీసీసీ చీఫ్ స్వయంగా ప్రకటించడంతో జిల్లా పార్టీలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుపై ఆశలు రేకెత్తిస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ పనికి కమీషన్

- కేసీఆర్‌పై విచారణ కమిషన్ వేయడం సిగ్గుచేటు
- నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పనికి కమీషన్‌లు తింటూ బీఆర్ఎస్ పార్టీపై విచారణ కమిషన్‌లు వేయడం విడ్డూరంగా ఉందని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. జిల్లాలో కాంగ్రెస్ నిర్వహించిన జనహిత పాదయాత్రలో పోలీసులతో బందోబస్తు ఎందుకు నిర్వహించారో నాయకులు జవాబు చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కారణంగా, ఆరు గ్యారంటీలను అటకెక్కించిన కారణంగా ప్రజలు ఎక్కడ తమపై తిరగబడుతారనే భయంతో వందలాది మంది పోలీసుతో పాదయాత్ర చేశారని ఇది సిగ్గుమాలిన చర్య అన్నారు. అర్గుల్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్‌పై పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలను ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అంటేనే అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అని అడుగడుగునా కమీషన్ల రాజ్యం నడుస్తుందన్నారు. జిల్లాలో 2లక్షల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ కూడా రాదని ప్రజలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారని బాజిరెడ్డి అన్నారు.

'గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి'



సుంకెట్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు

మోర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపునర్సయ్య, పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు అన్నారు. సోమవారం మండలంలోని సుంకెట్‌లో పలు అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేశారు. గ్రామంలోని మున్నూరుకాపు సంఘం వద్ద రూ.5లక్షల నిధులతో కిచెన్‌షెడ్డు నిర్మాణానికి, ప్రభుత్వ పాఠశాలలో రూ.4 లక్షల 80 వేలతో బాలికలు, బాలుర కోసం టాయిలెట్ల నిర్మాణానికి, గురడిరెడ్డి సంఘానికి రూ.5 లక్షలతో ప్రహరి నిర్మాణానికి నాయకులు భూమిపూజ చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఈ నిధులను మంజూరు చేయించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, కాంగ్రెస్ నాయకులు ఆనంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్, నాయకులు తీగెల నర్సారెడ్డి, ఎంసీ గంగాధర్, సంతోష్, రాజేష్, గంగనర్సయ్య, ప్రణయ్, వినోద్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నోరు జారితే ప్రజలే బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న మారచంద్రమోహన్, సాయిబాబా గౌడ్‌లు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనాయకులపై మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మరోసారి నోరుజారితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనహిత పాదయాత్రకు లభించిన అశేష ప్రజాదారణను చూసి జీర్ణించుకోలేని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని ఆయన వక్రబుద్ధికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను వారి కష్టనష్టాలను తీర్చడానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లు జనహిత పాదయాత్రను చేపట్టారని విచ్చేని అశేష జనానికి లబ్ధిదారులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు రేగుల సత్యనారాయణ, పండిత్ పవన్, లిక్కి శంకర్, ఫయాజ్, భూపేందర్, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఇసుక వాహనం పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక వాహనం

కోటగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం మంజీర నది సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టాటాఏస్ వాహనాన్ని పట్టుకున్నట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న 10 సెల్‌ఫోన్‌ల అప్పగింత



ఫోన్‌లను అప్పగిస్తున్న సీఐ

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బోధన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న 10 మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వాటి యజమానులకు సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ ఫోన్‌లను ప్రజలు జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు.

అడవి పందిని ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన సంఘం ప్రవీణ్

ఆలూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మచ్చర్ల గ్రామ శివారులో అడవి పంది అడ్డురావడంతో అడవి పందిని ఢీకొని బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన సంఘం ప్రవీణ్ తలకు తీవ్ర గాయాలతో నిజామాబాద్ ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గా ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు : ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులు

వేల్పూర్, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని లక్కోర గ్రామసమీపంలో 63వ జాతీయ రహదారిపై కారు ఆటోను ఢీకొంది దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై సంజీవ్ తెలిపారు. అంక్షాపూర్ నుంచి ఆటో డ్రైవర్, ప్యాసింజర్ ఆర్మూర్ వైపునకు వస్తుండగా లక్కోర సమీపంలో ఎదురుగా ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొంది. ఆర్మూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ లింబాద్రి, ప్యాసింజర్ ముత్తెన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ జలందర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ ఆటోను ఢీకొట్టినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పడిగెలలో కరెంట్ సమస్యను పరిష్కరించండి



సమస్యను ట్రాన్స్‌కో ఎస్‌ఈకి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

● బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న కరెంట్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈకి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం పడిగెల గ్రామానికి చెందిన రైతులు గ్రామంలో కరెంట్ సరఫరా సమస్యను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ట్రాన్స్‌కో ఎస్ఈ తో ఫోన్‌లో మాట్లాడారు. కరెంట్ సమస్య వల్ల సాగవుతున్న మొక్కజొన్న పంట ఎండిపోయే పరిస్థితి ఉందని, రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని ఎస్ఈ కి వివరించారు. గ్రామంలో గత మూడు రోజుల క్రితం పూర్తిగా కరెంట్ లేదని, రెండు రోజులుగా ఒక వైపు 6 గంటలు, మరో వైపు 6 గంటల చొప్పున కరెంట్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల పంటలకు నీరు సరిగా అందక మొక్కజొన్న పంట ఎండిపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్ సరఫరా విషయమై స్థానిక గ్రామ రైతులు సబ్‌స్టేషన్‌కు వెళ్లి అధికారులకు వివరించడం జరిగిందన్నారు. లోవోల్టేజీ సమస్య ఉందని, అందుకు మూడు కెపాసిటర్ సేల్స్, నాలుగు బ్యాటరీలు ఉంటేనే సమస్య పరిష్కారం అవుతుందని రైతులకు అధికారులు చెప్పినట్లు వివరించారు. వెంటనే సమస్య త్వరితగతిన పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఈని ఎమ్మెల్యే ఆదేశించారు.

అంతర్ పాఠశాలల మండల క్రీడా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

ఆర్మూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఆర్‌సీలో సోమవారం అంతర్ పాఠశాలల మండలక్రీడల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజగంగారాం మాట్లాడుతూ ఈ సంవత్సరం మండల క్రీడల నిర్వహణ కోసం వివిధ పాఠశాలల్లో తమ విద్యార్థులను సంసిద్ధులు చేయాలన్నారు. క్రీడల నిర్వహణకు ముందుకు రావాలని ప్రభుత్వ, ప్రైవేట్ పీడీలు, పీఈటీలకు సూచించారు. కార్యక్రమంలో పీడీలు మల్లేష్‌గౌడ్, గోపిరెడ్డి, మధు, గంగారెడ్డి, గంగాధర్, నిఖిత, రాజేశ్వర్, కిరణ్, జ్ఞానేశ్వర్, బ్రీజేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి చేయాలి

● ఉర్దు అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్



సన్మానం చేస్తున్న దృశ్యం

మాక్లూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక లబ్ధిదారుడికి అందేలా కృషి చేయాలని ఉర్దు అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని మాక్లూర్ కార్యాలయాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు ప్రతీ లబ్ధిదారుడికి అందుతున్నాయా అని ఆరా తీశారు. అంతేకాకుండా రేషన్‌కార్డులు, పెన్షన్‌లు ఎంతమందికి ఇస్తున్నారు, ఇటీవల కొత్తవారి వివరాలను అడిగి తెలుసుకుని అందరికీ అందజేయాలని కోరారు. అనంతరం వారికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ వెంకటేశ్వర్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో బ్రహ్మానందం, తదితరులున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డీజేసౌండ్ వాడొద్దు



యువకులకు సూచనలు ఇస్తున్న ఎస్సై

మాక్లూర్ , ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్‌ను ఉపయోగించవద్దని అలా చేసినచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీజే ఆపరేటర్లకు, యజమానులకు ఎస్సై రాజశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద శాంతియుతంగా పూజలు నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉండకుండా డీజే సౌండ్‌లను ఉపయోగించవద్దని ఆయన కోరారు.

కోటగిరి: గ్రామాలలో అనుమతి లేకుండా శబ్ద కాలుష్యం(డీజే సౌండ్)చేస్తే చర్యలు తప్పవని కోటగిరి ఎస్ఐ సునీల్ హెచ్చరించారు. కోటగిరి పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీజే ఆపరేటర్లు, యాజమానులతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా డీజే సౌండ్ చేస్తే డీజే బాక్స్‌లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

నందిపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీజే నిర్వహకులకు ఎస్సై శ్యాంరాజ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వినాయక చవితికి ఎటువంటి డీజేలు పెట్టరాదని ఒక వేళ నిబంధనలను ఉల్లంఘిస్తే డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అంతేకాకుండా డీజే నిర్వహకులకు , ఆపరేటర్లకు నోటీసులు జారీ చేశారు. గణేష్ ఉత్సవాలను దిగ్విజయంగా జరుపుకొనుటకు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్యామ్ రాజ్ కోరారు.

బీసీలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం

● పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్



మోర్తాడ్ ప్రజానిలయంలో మాట్లాడుతున్న టీపీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్

మోర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అందుకే ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తుందని పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజానిలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలని ఆయన అన్నారు. బీసీల కోసం ఎన్నడూ మాట్లాడని నాయకులు గర్జనల పేరుతో బీసీలకు దగ్గర కావాలని చూస్తున్నారని, ఇలాంటి పార్టీలను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కేసీఆర్ ఈ నెల 8న తమిళనాడులో బీసీ గర్జన పెడుతున్నారని కాగా బీసీలు వారిని నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రానున్న సంస్థాగత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ మళ్లీ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. బీసీలందరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా నిలవాలని వేణుగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పాదయాత్రలు చేస్తుంటే బెంబేలు పడుతున్న బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర ఎందుకని ప్రశ్నిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాదయాత్ర ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ నెల 6న చేపట్టిన 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించాలని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని బీసీ విద్యావంతులు, మేధావులు, ఉద్యమ కారులు భాగస్వాములు కావాలని వేణుగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల అధ్యక్షులు సోమదేవారెడ్డి, ముత్యాల రాములు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, నవీద్, ఆనంద్, రంజిత్, మహమ్మద్ షాదీక్, అర్గుల రమేష్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన నాయకులు

నవీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నవీపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిలు సందర్శించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశం మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి వారు వాకబు చేసినట్లు తెలిసింది. పలువురు ప్రభుత్వ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్న విషయాన్ని నాయకుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, పలు శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలను వినియోగించుకోవాలి

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకేపీ సీసీ గడాల రఘుపతి అన్నారు. సోమవారం మండలంలోని చేంగల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లించాలని, పీఎం సురక్ష బీమా యోజన , పీఎం జీవన జ్యోతి పథకాలను వినియోగించుకోవాలన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శృతిని మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు స్రవంతి, శరీష, లక్ష్మీ పాల్గొన్నారు.

వేధిస్తే షీటీంనకు సమాచారం ఇవ్వండి

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, యూవ్‌టీజింగ్ చేసినా, వేధింపులకు గురైనా వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని షీ టీం పోలీస్‌లు విఘ్నేష్, సుమతి తెలిపారు. సోమవారం భీమ్‌గల్ మండలంలోని చేంగల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు చట్టాలు, నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులకు గురైతే డయాల్ 100 లేదా 8712659795 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ముప్కాల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్, కొండ్రు నవీన్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం కృషి వలనే పదోన్నతులు జరుగుతున్నాయని, పెండింగ్ బిల్లులు ఒక్కొక్కటి క్లీయర్ అవుతున్నాయన్నారు. సెప్టెంబర్ 1న హైదారబాద్‌లో పెన్షన్ విద్రోహదినం సందర్భంగా ధర్నా చేపట్టాలని ప్రతీసభ్యుడు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రవికుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మెగిలి గంగారాం, గుండోజి నరేందర్, సామ ప్రసాద్, లక్ష్మణ్, పీఆర్‌టీయు నాయకులు రామకృష్ణ, మండల అధ్యక్షుడు రవికుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ముందుకు రావాలి

● ఐకేపీ ఏపీడీ, డీపీఎం



ఫౌల్ట్రీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఐకేపీ ఏపీడీ

కమ్మర్‌పల్లి, ఆగస్టు 4: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫౌల్ట్రీ యూనిట్‌ల నిర్వహణ నిమిత్తం మహిళా సంఘాలకు రుణసదుపాయాలు కల్పిస్తుందని ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావాలని ఐకేపీ ఏపీడీ మధుసూదన్, డీపీఎం రాచయ్యలు కోరారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రం శివారులో మహిళా సంఘం సభ్యురాలి ద్వారా నిర్వహిస్తున్న ఫౌల్ట్రీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి 250 యూనిట్లకు గాను ఒక్కోయూనిట్‌కు 2 వేల చొప్పున 5లక్షల రుణ సదుపాయం కల్పిస్తుందని ఆసక్తిగల మహిళా సంఘాల సభ్యులు ముందుకు వచ్చి యూనిట్లు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్‌కుమార్, సీసీలు రవికుమార్, అలే ఖ్య వివోలు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధితో వ్యవసాయ కూలీ మృతి

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో మహారాష్టకు చెందిన సంతోష్ రాంరావు కాంబ్లే (35) అనే వ్యవసాయ కూలీ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన యాల్లా రాజ్‌కుమార్ వద్ద వ్యవసాయ పనులను చూసుకోవడానికి మృతుడు జీతం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వ్యవసాయ పనుల కోసం వెళ్లి నీరు పారిస్తుండగా మూర్ఛవ్యాధి రావడంతో బోర్లపడి చనిపోయినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి అమలు చేయాలని కోరుతూ సోమవారం జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రైల్లో ఢిల్లీకి తరలివెళ్లారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 5,6,7వ తేదీల్లో జరిగే ధర్నాలో పాల్గొనేందుకు తరలివెళ్లామని కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు తెలిపారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారి లో కాంగ్రెస్ జిల్లా యువనాయకులు నరేష్, కాంగ్రెస్ నిజామాబాద్ రూరల్ నాయకుడు సొప్పరి వినోద్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ అప్పాల పెద్ద రాజన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్, హన్మాండ్లు, రవి, రోహిత్, మహిపాల్, తదితరులున్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జర్నలిస్టు కాలనీలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మీ, తల్లులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : బాలింతలు తమ పిల్లలకు ముర్రిపాలు తాగించాలని, ముర్రిపాలు పిల్లలకు అమృతంతో సమానమని ఏసీడీపీ జ్ఞానేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సమావేశంలో తల్లులు, గర్భిణులు, బాలింతలకు ముర్రిపాల ప్రాముఖ్యతను వివరించారు. సరైనా సమయంలో అనుబంధ ఆహారం మొదలు పెట్టడం పిల్లలకు తల్లిపాలను రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలని వారు వివరించారు. బిడ్డ బరువును, ఎత్తును ప్రతీనెల తీసి బిడ్డ పరిస్థితిని గమనించాలని తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీటీచర్లు జ్యోతి, గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బసవేశ్వర్ రావు అన్నారు. సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో లయన్స్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు నిత్యం సేవలందిస్తు లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ముందంజలో ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆర్‌సీ పావులూరి వెంకటేశ్వర్ రావు, నల్లూరి లక్ష్మీకాంత్, పావులూరి సుబ్బారావు, పావులూరి మనోజ్ఞ, తేజస్విని, సాయి కీర్తన తదితరులున్నారు.

శర్బత్‌కెనాల్ వద్ద అభివృద్ధి పనులు

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శర్బత్ కెనాల్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా ప్రయాణికులకు రూట్ మార్పు చేశామని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. ప్రజలు ఆచన్‌పల్లి బైపాస్, విజయమేరి వద్ద ఉన్న బైపాస్‌లను సద్వినియోగం చేసుకుని ఆ రూట్‌లలో ప్రయాణం చేయాలన్నారు. కేవలం టూ విల్లర్స్‌కు మాత్రమే అనుమతిస్తామన్నారు. బాన్సువాడ, వర్ని, రుద్రూర్ వెళ్లే బస్సులన్నీ బైపాస్ గుండానే వెళ్తాయన్నారు. ప్రయాణికులు అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకుని తమతమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 4, 7వ వార్డులలో మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో మధ్యాహ్నభోజనం పరిశీలన



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని, పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి సోమవారం సమ్మిరెడ్డి తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన వంటను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వంటలను వండిపెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రుద్రూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటగిరి ఎస్ఐ సునీల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రుద్రూరు బీజేపీ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమం లో కోటగిరి మండల కేంద్రంలో గల ఓ హెయిర్ కటింగ్ సెలూన్ షాప్‌లో కటింగ్ చేయించుకుందామని వెళ్లగా అక్కడే కటింగ్ చేయించుకుంటున్న కోటగిరి ఎస్ఐ సునీల్‌కుమార్ దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగారని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడిని అని చెప్పినా వినకుం డా ఇబ్బందులకు గురిచేశారన్నారు. కానిస్టేబుళ్లను పిలిపించి షాప్‌ను మూసివేయాలని చెప్పి అవమానపర్చే విధంగా వ్యవహరించారని ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. కళాశాలలో మిగిలిపోయిన సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు డిగ్రీ కళాశాలలో సాహితీ ప్రారంభ కార్యక్రమం

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, సప్తస్వర మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యతేజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో, విశిష్ట అతిథిగా సౌత్ ఫిలిం డైరెక్టర్ సూర్యతేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, పంప సాహితి పీఠం మహిళ అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి, జయశీల, మిట్టం ధనుంజయ్ హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

వర్సిటీలో ఎంఎడ్ సెమిస్టర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ 2025లో జరిగే ఎంఎడ్ 4వ సెమిస్టర్ రెగ్యూలర్, 1,2,3 బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ఫీజు కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు పరీక్షల నియంత్రణాధికారి సంపత్ కుమార్ తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా 18 వరకు చెల్లించవచ్చునని, 100రూ. అపరాధ రుసుముతో ఆగస్టు 21వరకు చెల్లించుకోవచ్చునని తెలిపారు.

నిద్రావస్థలో జంతు జనన నియంత్రణ కేంద్రం

- కొన్ని నెలలుగా కుక్కలకు కు.ని. లేవు
- నగరంలో కుక్కల స్వైర విహారంతో భయాందోళనలో ప్రజలు
- ఏజెన్సీ నిర్వాహకులకు డిమాండ్ ఉండడంతో నిర్వహణలో ఇబ్బందులు
- 3 నెలల కోసం టెండర్ ప్రక్రియ పూర్తి



నగరంలో కుక్కలు



ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తుతున్న నగర ప్రజలకు కుక్కల బారి నుంచి కాపాడేందుకు నగర పాలక సంస్థ కొన్నేళ్ల క్రితం ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), (జంతు జనన నియంత్రణ కేంద్రం) సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఒక్క కుక్క కోసం రూ.1600 చొప్పున ఖర్చు చేస్తూ కుక్కలను నిలువరించేందుకు హైదరాబాద్ నుంచి ఏజెన్సీని పిలిపించి కు.ని ఆపరేషన్‌లు చేయించింది. కానీ ప్రస్తుతం ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలుగా నిద్రావస్థలోనే ఉంది. కుక్కల బెడద ఎక్కువవుతున్నా వాటిని కంట్రోల్ చేయడంలో నగర పాలక సంస్థ విఫలమవుతుంది. ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేసినా ఫలితం మాత్రం ఇవ్వడం లేదు. కుక్కల జననాలను అడ్డుకునేందుకు డాక్టర్ల సహాయంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. గతంలో ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. ఇవి కొన్ని నెలలుగా ఆగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఏజెన్సీ నిర్వహకులు నిజామాబాద్ రాకపోవడంతో కు.నీ ఆపరేషన్లు ఆగిపోయాయి. అధికారులు సైతం ఏజెన్సీ నిర్వాహకులను ఎప్పటికప్పుడు పిలిచినా వారు రాకపోవడంతో ఇబ్బందిగా మారుతుంది. ఏజెన్సీలకు డిమాండ్ ఉండడంతో ఇబ్బందిగా మారింది. ఒక్క కుక్కకు రూ.1600 కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు ఇచ్చినా ఏజెన్సీ నిర్వాహకులకు ఆసక్తి చూపడం లేదు. నగరంలో వేలాది కుక్కలు ఉన్నా డాక్టర్లు కేవలం రోజుకు 5నుంచి 6వరకే కు.ని. ఆపరేషన్లు చేసే అవకాశం ఉంది. నగరంలోనికి కుక్కలన్నింటికి ఆపరేషన్‌లు చేయాల్సి వస్తే ఎంత సమయం పడుతుందనేది ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో కేవలం మూడు ఏజెన్సీలు మాత్రమే ఉండడంతో వారికి డిమాండ్ ఎక్కువగా ఉంది.

నగరంలో కుక్కల బెడద

నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఒక్కో కాలనీలో వందల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. వేలాది కుక్కలు నగరంలో ఉండడంతో నగరవాసులకు ఇబ్బందిగా మారింది. గత కొద్దిరోజుల క్రితం నగరంలోని వివిధ ప్రాంతాల్లో కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయాలపాలయ్యారు. నగరంలో ఏదో ఒక చోట ప్రతిరోజు కుక్కలదాడి సర్వసాధారనమైపోయింది. బయట తిరగాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్దుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయి. ఏ కుక్క ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం పూట రోడ్లపై వాకింగ్ చేయాలంటే కుక్కల దాడులతో జంకుతున్నారు. ఇటీవల అర్సపల్లి, అజాంకాలనీ, నాగారం, వినాయక్‌నగర్, ఆర్యగనర్ తదితర ప్రాంతాల్లో పలువురిపై కుక్కలు దాడిచేసి గాయపర్చాయి. వీటితోపాటు రాత్రుల్లో కుక్కలు గుంపులుగా తిరిగి వాహనాలపైకి, కాలినడక వెళ్లేవారిపై దాడులకు దిగుతున్నాయి. గాయాలైన బాధితులు ఆసుపత్రుల చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీవాసులు కుక్కల స్వైర విహారంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి ఫలితాలు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల కట్టడికి రెండు టీంలు

నగరంలో కుక్కలను కట్టడి చేయడానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కమిషనర్ దిలీప్ కుమార్ ప్రత్యేకంగా రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. నగరంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాల్లో వదిలివేయనున్నారు. 12మంది సిబ్బందితో కుక్కలను బందించే రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. నగరంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే వీరు తక్షణమే అక్కడికి వెళ్లి కుక్కలను బందించనున్నారు. వీరితోపాటు ఏబీసీ నిర్వహణ కోసం ఆగస్టు, సెప్టెంబర్, నవంబరు నెలలకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. ఏబీసీ సెంటర్ నిర్వహణ సక్రమంగా జరిగితే నగరంలో కుక్కలను నియంత్రించవచ్చు. కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేస్తే తప్ప వాటిని నియంత్రించే పరిస్థితి ఏర్పడడం లేదు.

ఏబీసీ సెంటర్ నిర్వహణ కోసం టెండర్లు పూర్తి
(దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్)



మూడు నెలల ఏబీసీ సెంటర్ నిర్వహణ కోసం టెండర్‌లు పూర్తయ్యాయి. నగరంలో కుక్కల బెడదను నియంత్రించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఏజెన్సీ నిర్వాహకులు రాగానే కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తాం. కుక్కల బెడదను తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.



ఆర్మూర్‌లోని జెండా మందిర్‌లో ప్రతిష్ఠించిన జెండా

నేడు ఆర్మూర్‌లో జెండా జాతర

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండాగల్లీలోని జెండా జాతరను నేడు నిర్వహిస్తున్నట్లు సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి అధ్యక్ష కార్యదర్శులు కొట్టాల సుమన్, కట్టాన్ దినేష్‌లు తెలిపారు. గత వందేళ్ల నుంచి శ్రావణమాసంలో జెండా మందిరంలో జెండా జాతర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రముఖులకు జాతరకు విచ్చేయాలని సర్వసమాజ్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటారు. అప్పట్లో ప్రజలకు ఆర్థిక స్థోమత లేక తిరుపతిలోని వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లలేని వారు ఆర్మూర్‌లోని జెండా మందిరంలోని జెండాను దర్శించుకుని ముడుపులు చెల్లించి తొమ్మి ది రోజులు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత జాతర నిర్వహించేవారు. అనంతరం ఆర్మూర్ శివారులో సర్వసమాజ్ సభ్యులు జెండాను అంకాపూర్ గ్రామస్థులకు అందజేస్తారు. అంకాపూర్ గ్రామంలో తొమ్మిది రోజుల పాటు పూజల అనంతరం జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామం లో పూజలందుకుని కంఠేశ్వర్ నీలకంఠ ఆలయంలో జెండాను ప్రతిష్ఠించి జాతర అనంతరం నేరుగా తిరుపతి దేవాలయానికి చేరుకుంటుంది.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు



సిద్దుల గుట్టపై పల్లకి సేవాలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతాలతో, బిల్వా పత్రాలతో అభిషేకం నిర్వహించారు. రామాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు పల్లె గంగారెడ్డి కుటుంబ సభ్యులు శివాలయంలో, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, ఆర్మూర్ భజన మండలి సభ్యులు నృత్యాలు చేస్తు భక్తి గీతాలు ఆలపించారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులందరికి ఆర్మూర్ రాజస్తాన్ సంఘ సభ్యులు, ఆర్మూర్ పట్టణానికి చెందిన కొట్టాల మోహన్ కుటుంబ సభ్యులు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బొండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళి, అలుశెట్టి నరేష్, సిద్దుల గుట్ట సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎంసీ డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీ ఎన్నిక



డిచ్‌పల్లి సీఎంసీ పాస్టరేట్ కమిటీ ఎన్నికైన ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మెడికల్ కళాశాల డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆరుగురు పోటీ పడగా ముగ్గురు కమిటీ సభ్యులుగా మెట్టు శాంసన్, దైవాశీర్వాదం, డానియల్ సురాన, ఎన్నికయ్యారు. అధికారులుగా మినిస్టీరియల్ సెక్ర టరి రెవరెండ్ జయనంద్ ,పెసిపిలేటర్ ఇన్‌చార్జి రెవరెండ్ ఏసుకుమార్, సహాయకులుగా దినాకర్, స్టీఫెన్ కుమార్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జయనంద్ మాట్లాడుతూ సీఎంసీ డిచ్‌పల్లి పాస్టరేట్ కమిటీకి ముగ్గురు ఎన్నికయ్యారని చెప్పారు. సీఎస్ఐ మెదక్ డయాసిస్ ద్వారా మరో ఇద్దరు సభ్యులను నామినేటేడ్ ద్వారా ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం ఈ కమిటీ వారికి పదవులు నిర్ణయిస్తారని చెప్పారు. నూతన సభ్యులను ఘనంగా సత్కరించారు.

టీయూలో ప్రారంభమైన తీజ్ వేడుకలు



టీయూలో ఘనంగా ప్రారంభమైన తీజ్ వేడుకలు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలో సోమవారం తీజ్ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ పండగలో బంజారాలు సంస్కృతి సంప్రాదాయలతో 9 రోజుల పాటు నిర్వహిస్తారని కార్యక్రమానికి హాజరైన ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తీజ్ ఉత్సవాలు వర్సిటీలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా అధ్యాపకులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. శాంత బాయి. కిరణ్ రాథోడ్,ప్రవీణ్, బీకోజీ, మహవీర్, రవీందర్ నాయక్, సాగర్, శ్రీనురాథోడ్, రాము హరీష్ పాల్గొన్నారు.

పాప నాగమ్మ ఆలయానికి బోనాలతో గంగపుత్రుల పాదయాత్ర

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండవ సోమవారం గంగపుత్రుల ఆనవాయితీ ప్రకారం బెల్లాల్ చెరువు కట్టపై ఉన్న పాపా నాగమ్మ తల్లికి ప్రతి సంవత్సరం బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు కోట అబ్బయ్య తెలిపారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి తెప్పోత్సవం కార్యక్రమంతో పాటు ఒడిబియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నామన్నారు. ప్రజలు బెల్లాల్ నీళ్ల తాగితే కీళ్ల నొప్పులు ఉండవని పేర్కొన్నారు. అమ్మవారి దయ వల్ల ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురియాలని, పాడిపంటలు సమృద్ధిగా కురువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వన భోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, వెండి పోశెట్టి, కోట అబ్బయ్య, లింగం, తోకల పోశెట్టి, బొంతల గంగాధర్, వెండి నగేష్, దత్తు, దాల్‌మల్క సాయిలు, వెండి గంగారాం, బాలయ్యలతో గంగపుత్ర మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్ర మహిళలు

విద్యార్థులు జాతీయ వాదం వైపు నడవాలి



ఏబీవీపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకుడు శివ

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఏబీ వీపీ సభ్యత్వ నమోదును జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ పాల్గొని చేయించారు. విద్యార్థులంతా జాతీయ వాదం వైపు నడవాలని సూచించారు. దేశంలో ఏబీవీపీ అతి పెద్ద విద్యార్థి సంఘంగా ముందుకు సాగుతుందని ప్రతీ ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సమీర్, లెనిన్, అనిల్, నెహ్రూ రామకృష్ణ పాల్గొన్నారు

మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మగ్గం వర్క్ మహిళలకు కుట్టు మిషన్ ప్రారంభం అవుతాయని సంస్థ డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి అందిస్తామని అభ్యర్థులు 19 నుంచి 45 వయస్సు కలిగి ఉండలన్నారు. ఆధార్, రేషన్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్, ఫోటోలు 5 తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏదైనా సమాచారం కోసం ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 08461 295428 నంబర్ కు సంప్రదించాలని ఆయన కోరారు.

26 రోజులు పని దినాలు కల్పించాలని

శివాజీ బీడీ ఫ్యాక్టరీ ముట్టడి

- ధర్నా నిర్వహించిన కార్మికులు



డిచ్‌పల్లిలో శివాజీ బీడీ ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్ యూనియన్ టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం డిచ్‌పల్లిలోని శివాజీ బీడీ ప్యాక్టరీ కార్మికులు 26 రోజుల పాటు నెలలో పని కల్పించాలని డిమాండ్ చేస్తు బీడీ ప్యాక్టరీ ముందు పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం శివాజీ ప్యాక్టరీ మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా బీడీ కార్మికులకు నెలలో వారం రోజులు మాత్రమే పని కల్పిస్తున్నరని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలలో 26 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన తునక ఆకు ఇవ్వాలని పీఎఫ్ నెంబర్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమ పై జీఎస్టీ కక్ష కట్టినట్లు విపరీతంగా ట్యాక్స్ పెంచడంతో కార్మికులు నష్టపోతున్నరన్నారు. వెంటనే ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2023 కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన్నట్లు 4వేల పించాన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం జీవన భృతి అందజేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, మురళి, కమీషన్ దారులు నర్సయ్య, సాయినాథ్, సుదర్శన్, శ్రీధర్, గణేశ్, రఘు, ఆంజనేయులు కార్మికులు, జమున, లక్ష్మీ, సుజాత, నర్సవ్వ పాల్గొన్నారు.



తరగతి గదికి తాళం వేసి ఉన్న దృశ్యం





తరగతి గదిలో ఉంచిన సామగ్రి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. గదుల కొరతకు మూలం

- గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- సంవత్సరం కాలంగా తరగతి గదిలోనే నిర్మాణ సామగ్రి
- తరగతిని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న విద్యార్థులు

రుద్రూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గత సంవత్సరం క్రితం అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పాఠశాలలో అదనపు గదులట నిర్మాణాల పనులు చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా తరగతి గది నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత నిర్మాణ పనులకు వినియోగించిన సామగ్రిని సంబంధిత కాంట్రాక్టర్ తిరిగి తీసుకెళ్లలేదు. నిర్మాణ సామగ్రిని ఓ తరగతి గదిలో భద్రపర్చుకున్నారు. తరగతికి తాళం వేసి వెళ్లిపోయారు. సంవత్సరం అవుతున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు సామగ్రిని తీసుకెళ్లలేదు. దీంతో తరగతుల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదిని అందుబాటులోకి తీసుకువస్తే పాఠశాల విద్యార్థులకు తరగతి గదులు పు ష్కలంగా ఉంటాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరగతి గదిలో ఉంచిన సామగ్రిని తీసుకెళ్లాలని ఎన్నిసార్లు ఫోన్ చేసి చెప్పిన సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు.

● తరగతి గదిలోనే సామగ్రి

విద్యార్థులు చదువుకోవాల్సిన తరగతిని కాంట్రాక్టర్ తన నిర్మాణ సామగ్రితో నింపేశారు. గత సంవత్సరం కాలంగా తరగతి గదిలోనే సామగ్రి ఉండడం గమనార్హం. సామగ్రిని ఖాళీ చేస్తే తరగతి గదిని విద్యార్థులకు కేటాయించి విద్యాబుద్దులు చెప్పేందుకు అనుకూలంగా ఉంటుంది. అయినప్పటికీ సదరు గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ పాఠశాలకు చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులు తరగతి గదుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదిలో ఉన్న సామగ్రిని తొలగిస్తే విద్యార్థులకు కాస్త వెసులుబాటుగా ఉంటుంది. విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తరగతి గదిని గత సంవత్సరం కాలంగా కాంట్రాక్టర్ అక్రమించుకున్నారు.

● ఏడాది కాలంగా తాళం

రుద్రూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో గత ఏడాది కాలంగా ఓ తరగతికి తాళం వేసి ఉంది. పాఠశాలలో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ పనులు ముగిసిపోయిన సామాగ్రిని మాత్రం తొలగించడం లేదు. పాఠశాలలో సంవత్సరం క్రితం పనులు పూర్తి చేశారు. తర్వాత తరగతి గదిలో సామగ్రి ఉంచి తాళం వేశారు. ఏడాది కాలం పూర్తయిన సదరు గుత్తేదారు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం సందర్భంగా విద్యార్థులకు తరగతి గదుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి తరగతిని ఖాళీ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



హెచ్చరిక బోర్డు లేక ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు



మూల మలుపు వద్ద కంప చెట్లు

ఏర్గట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏర్గట్ల, బట్టాపూర్ తడపాకల్‌కి వెళ్లే దారిలో మూలమలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకర మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. క్షతగ్రాతులు తమ సమస్యను ఎవరికి చెప్పుకునలేక ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా నష్టపోతున్నారు. మూల మలుపు వద్ద రోడ్లకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో ప్రమాదాలు అనివార్యమవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. తాడ్లరాంపూర్ నుంచి తడపాకల్ వెళ్లే దారిలో రోడ్డు ఎత్తుగా ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది. మండల కేంద్రంలో మెట్‌పల్లి వెళ్ళే దారిలో రెండు చోట్ల ప్రమాదకర మలుపు కంప చెట్లు పెరిగి ప్రయాణీలకు ఇబ్బందిగా మారింది. అంతే కాకుండా మండల కేంద్రం నుంచి బట్టాపూర్ వెళ్లే దారిలో మూలమలుపులు, కంప చెట్లతో నిండిపోయాయి. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద కంపచెట్లు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కంప చెట్లను తొలగించాలి..
ఇల్లెందుల నాగేంద్ర, తడపాకల్



రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక పోవడంతో ప్రమాధాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి కంపచెట్లు తొలగించాలి.

స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి

● సీపీ సాయి చైతన్య ● పోలీసు ప్రజావాణికి 14 వినతులు



కార్యాలయం బయట ఫిర్యాదు స్వీకరిస్తున్న సీపీ

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 14 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు దారుల నుంచి సమస్యలు విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల సీఐ, ఎస్సైలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. పోలీస్ కమిషనరేట్ ఎదుట ఉన్న ఫిర్యాదుదారుడి వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారికి సమస్యను వివరించి పరిష్కరించాల్సిందిగా సూచించారు.

ఓబీసీ మహాసభకు తరలిన జిల్లా బీసీ సంక్షేమ సంఘం

● జెండా ఊపి ప్రారంభించిన ఉర్దూ అకాడమీ చైర్మన్



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ పదవ జాతీయ మహా సభలకు జిల్లా బీసీ సంఘం నాయకులు బయలుదేరారు. సోమవారం ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ బీసీల మేరుకోరే ప్రభుత్వం అని అన్నారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలంటే 42 శాతం రిజర్వేషన్లు రావాల్సిందేనన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను కేంద్రం వెంటనే ఆమోదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, గంగారెడ్డి, నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్, బుస్స ఆంజనేయులు, దేవేందర్, వినోద్, శంకర్, అజయ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

● అధికారుల సమీక్షలో నగరపాలక సంస్థ కమిషనర్



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదని అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమీషనర్ అధికారులతో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఇంజనీరింగ్ సానిటేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. చెత్తను సరిగా వేరు చేయాలని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. వన మహోత్సవంకు సంబంధించిన కార్యకలాపాలపై దృష్టి పెట్టాలని సూచించారు. భువన్ సర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ సమీక్షలో డిప్యూటీ కమీషనర్ రవి బాబు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన జిల్లా కాంగ్రెస్ బీసీ నాయకులు



పీసీసీ అధ్యక్షుడితో రైల్లో శేఖర్‌గౌడ్, బీసీ నాయకులు

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన బీసీ నాయకులు ఢిల్లీ వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాతో పాటు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందించేందుకు నేతలు తరలివెళ్లారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, రాంభూపాల్, రామకృష్ణ, నాయకులు రత్నాకర్, దయాకర్‌గౌడ్, సుమన్, సుభాష్ ఎజాదవ్, ఇతర ముఖ్యనేతలు ఢిల్లీ వెళ్లారు.

నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

మోపాల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గత 21 సంవత్సరాలుగా తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు చ్కగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాస్, అమర్, పాఠశాల ఉపాధ్యాయులు నాగమణి, రాము, అనురాధా, గంగాప్రసాద్, గ్రామాభివృద్ధి కమిటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

శంభులింగేశ్వర ఆలయంలో శ్రావణ పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శంభులింగేశ్వర ఆలయంలో సోమవారం శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వయంభు లింగేశ్వర స్వామికి రుద్రనమక చమకంతో పంచామృత అభిషేకాలు జరిపారు. ఉదయం ప్రారంభమైన ప్రత్యేక పూజలు మధ్యాహ్నాం వరకు సాగాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

'ప్రజావాణి' వినతులను సత్వరమే పరిష్కరించాలి

» కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

» ప్రజావాణికి 143 వినతులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టి. వినాయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 143 ఫిర్యాదులు అందాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు సమస్యలను కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్‌లు అంకిత్ కుమార్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డిఆర్‌డివో సాయగౌడ్, డీపీవో శ్రీనివాస్‌రావు, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. వివిధ శాఖల అర్జీలను అక్కడే ఉన్న అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

పెన్షన్‌లు వచ్చేలా చూడాలి..

: షేక్ సాబిర్, వెంకటేష్

విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయని నగరంలోని బాబాసాహెబ్ పహాడ్‌కు చెందిన షేక్ సాబిర్ ఆవేదన వ్యక్తం చేశా డు. 2021లో రెండు కాళ్లు కరెంట్ షాక్‌కు గురై డాక్టర్లు తీసివేసారని అప్పటి నుంచి అవిటివాడిగానే ఉన్నానని పేర్కొన్నాడు. నాలుగు సంవత్సరాలైనా ఇప్పటికీ పెన్షన్ రావడం లేదని వెంటనే అధికారులు పెన్షన్ వచ్చేలా చూడాలన్నారు. అలాగే బోధన్‌కు చెందిన వెంకటేష్ గౌడ్‌కు పెన్షన్ రావడం లేదని కలెక్టరేట్‌లోని ప్రజావాణి లో ఫిర్యాదు చేశాడు. తనకు ఒక కాలు కొట్టివేసారని పేర్కొన్నాడు.

ఆస్తి కోసం వేధిస్తున్నారని తల్లి ఫిర్యాదు..

ఆస్తి కోసం వేధిస్తున్నారని మాక్లూర్ మండలం గాలిబ్‌నగర్‌కు చెందిన ప్రభావతి ఫిర్యాదు చేసింది. ఐదున్నర ఎకరాల భూమిని తనకు తెలియకుండానే కొడుకులు పట్టా మార్చుకున్నారని తెలిపారు. ఇంటి నుంచి గెంటి వేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరింది.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కంపోస్టింగ్, బయో మైనింగ్‌పై కార్మికులకు అవగాహన

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కంపోస్టింగ్, బయో మైనింగ్ పై డిప్యూటీ కమిషనర్ రవికుమార్ కార్మికులకు అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని నాగరంలో గల డంపింగ్ యార్డులో కార్మికులకు బయో మైనింగ్‌పై శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, వచ్చిన చెత్తను ఎలా వేరు చేయాలో తెలిపారు. బయో మైనింగ్ పనితీరుపై వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవికుమార్, డంపింగ్ యార్డు ఇన్‌చార్జి ప్రభుదాస్, శ్రీకాంత్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఇందల్వాయి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ మరణించిన తెలంగాణ కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బాధితులకు అందజేశారు. అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ హసీనా, చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన బాండ్ల సుజాత, గన్నారం గ్రామానికి చెందిన కాశెట్టి లక్ష్మి, కేకే తండాకు చెందిన జానకీ కుటుంబాలకు ఒక్కొక్కరికి 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

ధర్పల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రేషన్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని 12 గ్రామాల్లో ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు రేషన్ డీలర్లు అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా రేషన్ కార్డులను పంపిణీ చేయలేదని తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరలోపే అర్హులైన వారందరికి రేషన్ కార్డులను అందజేసిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంత, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఆర్ఐ రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, జియర్ గంగారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

'హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తరలిరావాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై మంగళవారం హరీష్‌రావు ఇస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు జిల్లా కార్యాలయానికి నేతలు తరలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించేందుకు జిల్లా పార్టీ కార్యాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్ గుప్త, షకీల్‌తో పాటు పార్టీ నేతలు పాల్గొననున్నారని తెలిపారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన కొండపూర్ యువకులు

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

సిరికొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మడి కొండపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 50 మంది కార్యకర్తలు డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరురు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఆకుల శ్రీనివాస్, సంజయ్‌గౌడ్, అక్షయ్, డాక్టర్ సురేష్, ఎండీ రఫీక్, ప్రవీణ్‌సతీష్, మల్లేష్, నరేష్, జీవరత్నంచ సోలమన్, బట్టు మహిపాల్, మోహన్‌నాయక్, కాశీరాం, సతీష్, రమేష్, ప్రభాకర్, సాయిలు తదితరులు ఉన్నారు.

విద్యాశాఖ ఉద్యోగిపై వేటు

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని కార్యాలయ వివరాలు బయటకు చేరవేస్తుందనే కారణంతో ఆమెను నగరంలోని ఓ పాఠశాలకు డిప్యుటేషన్ వేసినట్లు తెలుస్తోంది. సదరుఉద్యోగిపై ఇటీవల కార్యాలయ సిబ్బంది డీఈవోతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోపణలపై విచారణ జరిపిన అనంతరం ఆమెను నగరంలోని పాఠశాలకు సర్దుబాటులో పంపినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశానుసారం విచారణ జరిపిన డీఈవో నగరంలోని ఓ పాఠశాలకు డిప్యూటేషన్ వేయగా ఆమెవీధుల్లో చేరేందుకు వెనకాడుతున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామ కమిటీ సభ్యులు

ఇందల్వాయి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందల్వాయి వీడీసీ సభ్యులు సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను తీర్చాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఇందల్వాయి గ్రామ సమస్యను తీర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇందల్వాయి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అర్హులైన నిరుపేదలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 48 మంది కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చారు కానీ ఇళ్లకు పట్టాలు, కనీస వసతులు మరిచారని సమస్యలను వెంటనే తీర్చాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని, విద్యుత్ సమస్య, తాగునీటి, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యేను కోరగా 20 రోజుల్లో సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, గొల్లరాంబాబు, పెద్దసాయిలు, హుస్సేన్, పుష్ప, మీనా, సమీనాబేగం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

బోధన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు, అభివృద్ధి పనుల్లో భాగంగా మంగళవారం సరస్వతి నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, శివాలయం, పాతబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కోటౌన్ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు.

వేధింపులపై అధికారులకు వార్నింగ్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న క్లాస్-4 ఉద్యోగినిని వేధించినట్లు 'ఆంధ్రజ్యోతి' జిల్లా ఎడిషన్‌లో వచ్చిన కథనానికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి స్పందించారు. ఈ విషయమై వేధింపులకు గురైన ఉద్యోగినితో పాటు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఒంటరి మహిళగా ఉన్న క్లాస్-4 ఉద్యోగినిని వేధించడం సరికాదని ఆయన అధికారులపై మండిపడినట్లు తెలుస్తోంది. ఉద్యోగినిని కూడా పిలిచి ఆమెకు ఉన్న సమస్యను కలెక్టర్ నిదానంగా విని ఆమెకు గల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఇకపై వార్డెన్‌లను కానీ, మహిళ ఉద్యోగులను కానీ ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించినట్లు సమాచారం.

నేడు విచారణ సవ్యంగా సాగేనా?

బీసీ సంక్షేమ శాఖలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి వేధింపులపై క్లాస్-4 ఉద్యోగిని మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న అధికారికి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికి దగ్గరి బంధుత్వం ఉండటంతో విచారణ ఏకపక్షంగా సాగుతుందనే అనుమానాలు ఉన్నాయి. విచారణ కమిటీలో జిల్లా ఇన్‌చార్జి అధికారి ఉండటంతో విచారణకు ఇబ్బంది ఉంటుందని బాధితురాలు కలెక్టర్‌కు తెలిపినట్లు సమాచారం.

ప్రైవేటు కళాశాలలో విద్యార్థినిని వేధించిన లెక్చరర్

నిజామాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలోగల ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్ విద్యార్థినిని వేధించినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ మేరకు సోమవారం రాత్రి కళాశాల వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల పట్ల లెక్చరర్లు వేధింపులకు గురిచేయడం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఈ విషయంలో సంబంధిత లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని వేధించిన ఘటన వెలుగులోకి రావడంతో 4వ టౌన్ పోలీసులు కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

19 ఏళ్ల లోపు వారికి నులి పురుగు నివారణ మాత్రను అందించాలి

» పాఠశాల, కళాశాలలో నోడల్ అధికారిని నియమించాలి

» అల్బెండజోల్ మాత్రతో ఆరోగ్య సమస్యలు దూరం

» కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణ మాత్రను 19 సంవత్సరాలు లోపు ప్రతి ఒక్కరికీ అందించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో డి వార్మింగ్ డే కార్యక్రమంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, మదర్సాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, బడి బయట ఉన్న పిల్లలందరికి నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రను అందించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనత, బరువు తగ్గుదల, తదితర వ్యాధుల నుంచి కాపాడడానికి అల్బెండజోల్ మాత్ర దోహదపడుతుందని తెలిపారు. ఈ మాత్ర వేసుకోవడం ద్వారా ఎనిమియా ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. ఈనెల 9, 11వ తేదీల్లో రెండు రోజుల పాటు తప్పనిసరిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 11న అన్ని చోట్ల అల్బెండజోల్ మాత్రలు ప్రతి విద్యార్థికి వేసారా లేదా అన్నది నిర్ధారించాలని, ఒకవేళ ఎవరైనా తప్పిపోతే అలాంటి వారిని సైతం గుర్తించి ఆగస్టు 18న నులి పెరుగునివారణ మాత్ర వేయించాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ.. ఈనెల 11న నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1నుంచి 19సంవత్సరాల వయస్సు ఉన్నవారు 4లక్షల 5వేల 443మంది ఉన్నారని, వారికి మాత్రమే వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మాత్ర వేసుకున్న తర్వాత వాంతులు, విరోచనాలు అయితే అత్యవసరమైతే సమీప ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా డి వార్మింగ్ డేను పురస్కరించుకొని రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్, డిపివో శ్రీనివాస్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్, డిడబ్ల్యువో రసూల్‌బీ పాల్గొన్నారు.

గడువులోపు గగనమే!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించిన ఆచరణ సాధ్యం కాలేదు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న దరఖాస్తులతో పాటు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లకాగితం ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించాలని భూభారతి ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో 9185 సాదాబైనామా దరఖాస్తులను తాజాగా స్వీకరించగా గతంలో స్వీకరించిన దరఖాస్తులు సైతం 10వేల పైనే ఉన్నాయి. ఎన్నో ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో సాధాబైనామాల దరఖాస్తులు మాత్రం ప్రస్తుతం పరిశీలించడం లేదు. ప్రభుత్వం నుంచి సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలన కోసం ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో అధికారులు ప్రస్తుతానికి వాటిని పరిశీలించడం లేదు. అసైన్డ్ భూములు ఇతరులు కొనుగోలు చేస్తే వాటికి, సాదాబైనామాల దరఖాస్తులకు నోటీసులు మాత్రం ఇస్తున్నారు. ఆగస్టు 15లోగా భూభారతి దరఖాస్తులను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతుండటంతో గడువులోపు పూర్తి కావడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది

(5వ పేజీ తరువాయి)

ఈ సందర్భంగా విద్యుత్ సౌదా జట్టు కెప్టెన్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి సామాజిక సేవ కార్యక్రమంలో కరోనా సమయంలో సేవలు చేసినందుకు గాను అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. అంతకుముందు సీపీ సాయి చైతన్య క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి హాకీ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో మొదటి పోటీలో నిజామాబాద్-కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు 0-1 తేడాతో విజయం సాధించింది. విద్యుత్ సౌదా-నల్గొండ జట్లు పోటీ పడగా 0-3తో నల్గొండ జట్టు గెలుపొందింది. నల్గొండ-వరంగల్ జట్లు తలపడగా 1-3తో వరంగల్ జట్టు గెలిచింది. సెమీ ఫైనల్‌కు నిజామాబాద్-నల్గొండ-కరీంనగర్-వరంగల్ జట్లు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్ కుమార్, ఎస్ఈ టివి రావు, అడిషనల్ డిసిపి కె రాంచందర్‌రావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, డీఈలు రమేష్, విక్రం, టోర్నమెంట్ ఆర్గనైజర్లు, స్పోర్ట్స్ సెక్రెటరీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.230	రూ.280	రూ. 300

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,00,700	రూ.92,900	రూ.1180

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మహావతార్ నరసింహ (10.10, 1.00)
: కింగ్డమ్ (4.15, 10.45)
: సైయ్యారా (హిందీ) (7.30)
స్క్రీన్-2 : కింగ్డమ్ (10.40) : సర్ మేడమ్ (1.55)
: మహావతార్ నర్సింహ (4.50, 7.40, 10.30)
స్క్రీన్-3 : సన్నాఫ్ సర్దార్-2 (హిందీ) (10.00, 4.30, 10.35)
: హరిహర వీరమల్లు (1.10)
: సర్ మేడమ్ (7.40)
స్క్రీన్-4 : సైయ్యారా (హిందీ) (10.20, 4.30, 10.40)
: దడక్-2 (హిందీ) (1.30, 7.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్డమ్ (1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : సర్ మేడమ్ (11.00)
: సన్నాఫ్ సర్ధార్-2 (హిందీ) (1.40, 10.30)
: హరిహర వీరమల్లు (4.35)
: సయ్యారా (హిందీ) (7.30)
స్క్రీన్-3 : మహావతార్ నరసింహ (11.00, 1.40, 4.30, 7.30, 10.30)

దేవి: మహావతార నరసింహ (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హరిహర వీరమల్లు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సర్ మేడమ్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కింగ్డమ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్